
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 24 జూన్ 2024 | 3

ప్రజా ఆకాంక్షల మేరకు నూతన ప్రభుత్వ పాలన - 5లో
» రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్

త్వరలోనే పిఠాపురంలో పవన్ పర్యటన: జనసేన నేత నాగబాబు - 5లో

రేషన్ కార్డుదారులకు శుభవార్త



» ఇక బియ్యం, పంచదారతోపాటు కందిపప్పు పంపిణీ
» కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలివారంలోనే నిర్ణయం
» వైసీపీ పాలనలో గత 12నెలల్లో ఒక నెల మాత్రమే పంపిణీ

పిఠాపురం, జూన్ 23: కందిపప్పు ధరలు మార్కెట్‌లో గణనీయంగా పెరిగిన వేళ నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం రేషన్‌కార్డుదారులకు శుభవార్త చెప్పింది. ప్రతి నెలా బియ్యం, పంచదారతోపాటు కందిపప్పును అందజేస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడిన తొలివారంలోనే తీసుకున్న ఈ నిర్ణయం ప్రజలకు ఆనందం కలిగించింది. వైసీపీ పాలనలో గత 12నెలల్లో ఒక నెల మాత్రమే కందిపప్పు పంపిణీ చేసి కార్డుదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది.

ప్రజలు ఎక్కువగా వినియోగించే కందిపప్పును సబ్సిడీ ధరపై అందించే విధానాన్ని తెలుగుదేశం ప్రభుత్వం ప్రవేశపెట్టింది. 2014 నుంచి 2019 వరకూ అధికారంలో ఉన్న సమయంలో ప్రతినెలా క్రమం తప్పకుండా తొలుత రెండు కిలోలు, తదనంతరం ఒక కిలో వంతున కందిపప్పును తెలుపురంగు రేషన్‌కార్డుదారులకు అందించేవారు. మార్కెట్‌లో కందిపప్పు ధర ఎంత అధికంగాఉన్నా ప్రభుత్వం ఆ భారాన్ని భరించి కార్డుదారులకు అందించేది. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పరిస్థితులు మారిపోయాయి. సబ్సిడీపై అందించే కిలో కందిపప్పు ధరను రూ.67కి పెంచారు. మార్కెట్‌లో అదే ధరకు ఉన్న సమయం లో తప్పనిసరిగా కందిపప్పును తీసుకోవాలంటూ రేషన్‌కార్డుదారులకు అంటగట్టారు. తొలి రెండున్నరేళ్ల ప్రభుత్వం ఇదే రీతిలో వ్యవహరించి తమపై భారం పడకుండా తప్పించుకుంది.

ధర పెరగగానే చేతులెత్తేశారు

రెండేళ్లుగా దేశవ్యాప్తంగా కందిపప్పు ధరలు గణనీయంగా పెరిగాయి. కిలో రూ.125 నుంచి పెరుగుతూ వచ్చి ఇప్పుడు గరిష్ఠంగా రూ.200కి చేరింది. ధరలు అధికం అవ్వడంతో ప్రజలు కందిపప్పు వినియోగాన్ని బాగా తగ్గించివేశారు. అదే సమయంలో కార్డుదారులకు సబ్సిడీపై కందిపప్పు అందివ్వాల్సిన అప్పటి వైసీపీ ప్రభుత్వం ఆ బాధ్యత తమది కాదన్నట్లు వ్యవహరించింది. మార్కెట్‌లో ధర అధికంగా ఉందని, ఇప్పుడు ఆ ధరకు కొని సరఫరా చేయాలంటే ప్రభుత్వంపై భారం పడిపోతుందని అప్పటి ప్రభుత్వ పెద్దలు చెప్పుకొచ్చారు. ఫలితంగా రెండు, మూడు నెలలుకు ఒకసారి కందిపప్పును సరఫరా చేస్తూ వచ్చారు.

పండుగలను విస్మరించారు

గత 12నెలల కాలంలో వైసీపీ ప్రభుత్వం మరీ దారుణం గా వ్యవహరించింది. పండుగల సమయాల్లో కూడా కందిపప్పును సరఫరా చేయలేదు. ప్రతినెలా రేషన్‌కార్డుదారుల ముంగిటకే సరుకులను ఎండీయూ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం కేంద్రం అందించిన బియ్యం, పంచదార పంపిణీకే పరిమితమయ్యారు. కందిపప్పును పూర్తిగా విస్మరించారు. 12నెలల కాలంలో ఒకనెల మాత్రమే కందిపప్పును సరఫరా చేశారంటే వైసీపీ ప్రభుత్వం రేషన్‌కార్డుదారులపట్ల ఎంత దారుణంగా వ్యవహరించిందో అర్థమవుతోంది. వినాయక చవితి, దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి, ఉగాది సమయాల్లోను కందిపప్పును కార్డులపై అందించలేదు. ఎన్నికల ముందు పంపిణీ చేస్తున్నట్లు హడావుడి చేసినా అది ప్రకటనలకే పరిమితమైంది.

బాధ్యతలు చేపట్టగానే..

రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు చేపట్టగానే పరిస్థితిలో ఒక్కసారిగా మార్పువచ్చింది. కందిపప్పు ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో కొనుగోలుకు ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణం రేషన్‌కార్డుదారులకు కందిపప్పు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జూలైనుంచే తెలుపు రంగు రేషన్‌కార్డుదారులకు బియ్యం, పంచదారతోపాటు కందిపప్పును అందించనున్నారు. మరోవైపు కందిపప్పు ప్యాకెట్లు తూకంలో వస్తున్న తేడాలపై కూడా ప్రభుత్వం దృష్టిసారించింది. పౌరసరఫరాల శాఖా మంత్రిగా నియమితులైన నాదెండ్ల మనోహర్ సివిల్‌సప్లైస్ గొడౌన్లల్లో తనిఖీలు నిర్వహించగా పలు లోపాలు వెలుగు చూశాయి. కందిపప్పు కిలో ప్యాకెట్‌లో 30 గ్రాముల నుంచి 100 గ్రాముల వరకూ తక్కువ వచ్చింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని గొడౌన్లలో ఉన్న కందిపప్పు నిల్వలపై తనిఖీలు చేపట్టగా అక్కడ తూకంలో తరుగు కనిపించింది. దీంతో బాధ్యులపై చర్యలకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై కార్డుదారులకు అందించే కందిపప్పు కిలో ప్యాకెటు కచ్చితంగా అదే బరువు ఉండేలా చూడాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

కందిపప్పు ఎంత అవసరం

కాకినాడ జిల్లాలో 6లక్షల53వేల750 బియ్యం కార్డులు ఉన్నాయి. వీరికి కిలో వంతున కందిపప్పు పంపిణీ చేసేందుకు 654టన్నుల కందిపప్పు అవసరమవుతుంది. ఈ మేరకు కోటా కేటాయింపునకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అవసరమైన కందిపప్పు సేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ పూర్తిస్థాయిలో కేటాయింపులు జరపలేదు. 80శాతం మాత్రమే కేటాయించి వాటిని కార్డులకు సర్దుబాటు చేసేవారు. చివరి రెండేళ్ల అది కూడా చేయలేదు.

ఇక కార్డులపై పలు సరుకులు

రేషన్‌కార్డులపై బియ్యం, పంచదారతోపాటు పలు రకాల సరుకులు అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కందిపప్పు, వంటనూనె, గోధుమపిండి ఇతర సరుకులను అందించేవారు. ఇప్పుడు అదే మాదిరిగా వంటనూనె, గోదుమపిండితోపాటు ఇంకా ఏయే సరుకులు సరఫరా చేయవచ్చో పరిశీలన చేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలందాయి. కిలో కందిపప్పు ధర రూ.200 ఉన్న సమయంలో కార్డుదారులకు రూ.67కే వచ్చేనెలనుంచి అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వైసీపీకి షాక్


వైసీపీ కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద కార్పొరేషన్ అధికారులు అతికించిన నోటీసు

» కాకినాడలోని వైసీపీ జిల్లా కార్యాలయం ప్రధాన ముఖద్వారం వద్ద నోటీసులు అంటించిన కార్పొరేషన్ అధికారులు
» అక్రమ నిర్మాణాలకు వారం రోజుల్లోగా సమాధానం చెప్పాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబుకు నోటీసులు జారీ
» 'అడ్డగోలుగా ప్లాన్' కథనానికి స్పందన

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 23: అధికారాన్ని అడ్డం పెట్టుకుని అక్రమంగా నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయంపై ఆంధ్రజ్యోతిలో 'అడ్డగోలుగా ప్లాన్' పేరుతో కథనం వెలువడడంతో స్పందించిన అధికారులు వైసీపీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబు పేరు మీద నోటీసులు జారీ చేశారు. జిల్లా వైసీపీ కార్యాలయం ప్రధాన ముఖద్వారంవద్ద నగరపాలక సంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు అతికించారు. వివిధ సెక్షన్ల కింద అక్రమ నిర్మాణాలకు వారంరోజుల్లో సమాధానం చెప్పాలని కన్నబాబుకు నోటీసులు జారీ చేశారు.

వివిధ సెక్షన్ల కింద నోటీసులు

ఏపీఎంసీ చట్టం 1955 సెక్షన్ 452(1), 461(1)ఆర్/డబ్ల్యు 428, 429, ఏపీఎంఆర్ అండ్ యుడీఏ చట్టం 20516 సెక్షన్ 89(1అండ్2) ఆర్/డబ్ల్యుసెక్షన్ 82,90(1) కింద నోటీసు నెం.75/1060/కెకెడి/యుసి/2024 ఇచ్చారు. కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ సమీపంలోని డోర్‌నెంబర్/ప్లాట్ నెంబర్ 68-12-8 పైడా వారి వీధి, రాజేశ్వరినగర్ ప్రాంతంవద్ద ఏపీఎంసీ చట్టంలోని సెక్షన్ 452(1) అండ్ 461(1) కింద నోటీసు, సెక్షన్ 89(1అండ్2) ఆర్/డబ్ల్యు సెక్షన్ 82, 90(1) ఆఫ్ ఏపీఎంఆర్ అండ్ యుడీఏ చట్టం 2016(చట్టం 5ఆఫ్ 2016)-జారీచేశారు. కాగా ఆ డోర్ నెంబర్‌లో కె.కన్నబాబు వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనధికారికంగా నిర్మాణం చేపడుతున్నారని 68-12-8 పైడా వారివీధి, రాజేశ్వరినగర్ ప్రాంతం కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిమితులవద్ద ఉంది.

ఏపీఎంసీ చట్టం, ఏపీఎంఆర్ అండ్ యుడీఏ చట్టం నిబంధనలకు విరుద్ధంగా అనధికార నిర్మాణాల వివరాలు

సెట్‌బ్యాక్ ఫ్రంట్ నియమం ప్రకారం మూడు మీటర్లు ఉండాలి కానీ 12మీటర్లు ఉంది. సెట్‌బ్యాక్ రేర్ నియమం ప్రకారం 6 మీటర్లకు 14ఉంది. సెట్‌బ్యాక్ సైడ్ 1-6మీటర్లకుగాను 6.5 మీటర్లు, సెట్‌బ్యాక్ సైడ్-2 6మీటర్లకు 13 మీటర్లు వినియోగించినట్లు గుర్తించారు. సెల్లార్, గ్రౌండ్‌ప్లస్ -1 అంతస్తులు నిర్మించి ఉన్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కన్నబాబుకు ఈ తాత్కాలిక ఉత్తర్వు ఇచ్చారు. తదుపరి నిర్మాణాన్ని తక్షణమే ఆపివేయాలని అనధికారిక నిరాణాన్ని ఏడు రోజుల లోపు ఎందుకు తొలగించకూడదో.. మార్పు చేయకూడదో లేదా ఎందుకు తీసివేయకూడదో తగిన కారణాన్ని చూపాలని ఆదేశించారు. ఈ నోటీసు రశీదు విఫలమైతే అది నిరంతర ఉద్దేశపూర్వకంగా నేరంగా పరిగణిస్తారని, ఏపీఎంసీ సెక్షన్ 452(2)అండ్ 461(2) ప్రకారం నిర్దేశించిన ప్రొవిజనల్ ప్రకారం తదుపరి చర్య తీసుకుంటామని అధికారులు తెలిపారు.

తునిలో అట్టహాసంగా ఎమ్మెల్యే దివ్య విజయోత్సవ సభ


టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, తుని ఎమ్మెల్యే యనమల దివ్యలను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

» తుని ఎమ్మెల్యే యనమల దివ్యకు ఘనస్వాగతం పలికిన కూటమి శ్రేణులు
» హాజరైన పలువురు ఎమ్మెల్యేలు, మంత్రి సుభాష్

తుని రూరల్, జూన్ 23: సార్వత్రిక ఎన్నికల్లో తునినుంచి భారీ మెజార్టీ సాధించిన తుని ఎమ్మెల్యే యనమల దివ్య అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసి పట్టణంలో అడుగుపెట్టడంతో ఎన్డీయే కూటమి శ్రేణులు, నాయకులు ఆమె ఘనస్వాగతం పలికారు. వేలాదిమంది కార్యకర్తలు, ప్రజలు తుని పట్టణ పురవీధుల్లో విజయోత్సవ ర్యాలీని అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన విజయోత్సవ సభలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. ఎమ్మెల్యే యనమల దివ్య ప్రజాసభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ విజయం తుని ప్రజలకు అంకితమని, ప్రజల పక్షాన నిలబడి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషిచేస్తానన్నారు. తునిలో అవినీతి, అక్రమాలకు తావులేదని, ప్రశాంత వాతావరణం ఉంటుందన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి శ్రేణులు క్రమశిక్షణ గలవారని, అదే నడవడికతో ముందుకు సాగుదామన్నారు. రాష్ట్రంలోనే తుని నియోజకవర్గాన్ని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికలను డబ్బులు ప్రభావితం చేయలేదని, సేవా నిబద్ధతకు మాత్రమే ప్రజలు పట్టం కడతారన్నారు. ఎన్నికల్లో అవినీతి సొమ్ము పంచి మరోసారి గద్దెనెక్కాలని వైసీపీ భావించిందని, బటన్‌లు నొక్కి ప్రలోభాలకు గురిచేద్దామనుకున్న రాష్ట్ర ప్రజలు నెగిటివ్ బటన్ నొక్కి వైసీపీని 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. వలసలు వెళ్లినా రాష్ట్ర ప్రజలు ఇతర రాష్ట్రాలనుంచి, ఇతర దేశాల నుంచి స్వచ్ఛందంగా వచ్చి అర్ధరాత్రి వరకు వేచి ఉండి ఓటు హక్కువినియోగించుకున్నారని, ఇది ప్రజాస్వామ్యంలో శుభసూచికం అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతటి ఘన విజయానికి పట్టంకట్టిన ప్రజానీకం నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. కార్యకర్తలపై రాజకీయ ప్రేరేపిత కేసులన్నీ 100 రోజుల్లో ఎత్తివేస్తామని వైసీపీ నాయకులు ఎన్ని ఇబ్బందులు, అరాచకాలు చేసినా కార్యకర్తలు ఎదురొడ్డి నిలబడ్డారన్నారు. వారందరినీ పార్టీ గుర్తిస్తుందని, త్వరలోనే నామినేటెడ్ పదవులతో సత్కరించి ప్రభుత్వంలో భాగస్వాములయ్యేలా చేస్తామన్నారు. మంత్రి సుభాష్, ఎమ్మెల్యేలు జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, వనమాడి కొండబాబు, పంతం నానాజీ, టీడీపీ సీనియర్ నాయకుడు చిక్కాల రామచంద్రరావు, తుని మాజీ ఎమ్మెల్యే రాజాల అశోక్‌బాబు మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన నేత యనమల రామకృష్ణుడని, రాష్ట్ర అభివృద్ధిలో ఆయన పాత్ర ఎంతో కీలకమన్నారు. యనమల కుమార్తె దివ్యకు తుని ప్రజలు భారీమెజార్టీతో పట్టం కట్టి తునిలో చరిత్ర తిరగరాయడం అభినందనీయమని ఆమె మరింత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. పుష్పగుచ్ఛాలు, దుశ్శాలువాలతో యనమల రామకృష్ణుడు, దివ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు కీలక నేతలతోపాటు టీడీపీ యువనేత యనమల రాజేష్, టీడీపీ ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమరాజు, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి శోభారాణి, ఇనుగంటి సత్యనారాయణలతోపాటు నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఇళ్ల స్థలాల కల సాకారమవుతుందా?

» కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దుమ్ములపేట వాసుల ఎదురుచూపులు


గతంలో ఇళ్ల నిర్మాణాలకు మంత్రి రవీంద్ర శంకుస్థాపన చేసిన శిలాఫలకం

కాకినాడ సిటీ, జూన్ 23: దశాబ్దాల తరబడి ఎదురు చూస్తున్న కాకినాడ దుమ్ములపేటవాసుల ఇళ్లస్థలాల కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయి. గత టీడీపీ హయాంలో 2017లో దుమ్ముపేటవద్ద 8.06ఎకరాల్లో ఒక్కొక్క రికి 60గజాల చొప్పున 342మందికి ఇచ్చిన ఇళ్లస్థలాల పట్టాలిచ్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక 2020లో ఈ పట్టాలను రద్దు చేసి వేరే వారికి కేటాయించారు. దీంతో దుమ్ములపేట వాసులు ఈ స్థలాలకోసం అప్పటినుంచి పోరాడుతున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో తమ స్థలాలు తమకు దక్కుతాయని లబ్ధిదారులు సంబరాలు చేసుకుంటున్నారు. నాలుగేళ్లుగా ఈ స్థలాలకోసం పోరాటం చేసిన దుమ్ములపేట వాసులపై వైసీపీ వాళ్లు అనేక కేసులు పెట్టించారు. ఆనాడు లబ్ధిదారులకు అండగా నిలబడిన సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, టీడీపీ నాయకుల మీద అప్పట్లో కేసులు పెట్టారు. అధికారం మారడంతో గతంలో మంత్రి కొల్లు రవీంద్ర శంకుస్థాపన చేసిన శిలాఫలకానికి హడావుడిగా రంగులు వేశారు. అక్కడ జరుగుతున్న ఇళ్ల నిర్మాణ పనులను అధికారులు నిలిపివేయించారు.

రూ.11.97 కోట్లతో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

అప్పట్లో రూ.11.97కోట్ల అంచనా ఈ లేఅవుట్‌లో 342 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2018, డిసెంబర్ 28న శంకుస్థాపన చేయగా ఆ తర్వాత ఆరునెలల్లో వచ్చిన ఎన్నికల్లో టీడీపీ అధికారం కోల్పోవడంతో ఇళ్ల నిర్మాణం జరగలేదు. ఈ పరిస్థితుల్లో 2017, అక్టోబరు 14న లబ్ధిదారులకు ఇచ్చిన పట్టా స్థలాల్లో 22నెలలుగా ఇళ్లు కట్టుకోలేదని 2020లో అప్పటి తహసీల్దార్ పట్టాలను రద్దు చేశారు. దీనిపై లబ్ధిదారులు హైకోర్టును ఆశ్రయించడంతో దుమ్ములపేట పట్టాలపై ఎటువంటి బదలాయింపు చేపట్టరాదని ఆదేశాలు జారీ అయ్యాయి. వీటిని పరిగణనలోకి తీసుకోకుండా వేరేవాళ్లకు ఈ స్థలాల్లో పట్టాలు ఇవ్వడంతో వివాదం తలెత్తింది. దీనిపై లబ్ధిదారులు వేర్వేరుగా హైకోర్టులో రిట్‌పిటిషన్‌లు, కంటెమ్ పిటిషన్‌లు వేశారు.

నాడు ఎన్టీఆర్ ఇళ్ల స్థలాల పట్టాలిచ్చారు..

1983లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో అప్పటి సీఎం ఎన్టీఆర్ దుమ్ములపేటవాసులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ పట్టాలిచ్చారు. ఈ స్థలాలను మెరక చేసుకునే స్థోమత లేక ఇటుకతో బేస్‌మెంట్‌లు వేసుకుని వదిలేశారు. ఆ తర్వాత ఈ స్థలాలను పట్టాదారులు డంపింగ్ చెత్త, డెబ్రిస్‌తో మెరక చేసుకున్నారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన వనమాడి కొండబాబు దుమ్ములపేట స్థలాలపై ప్రత్యేక దృష్టిపెట్టారు. స్థలాల్ని మెరక చేయించి 60 గజాల చొప్పున 342 లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చేందుకు లేఅవుట్ వేయించారు. దుమ్ములపేట మత్స్యకారులతోపాటు మరికొందరు లబ్ధిదారులకు ఈ లేఅవుట్‌లో పట్టాలిచ్చారు. ఆ తర్వాత గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వంనుంచి రూ.11.97 కోట్ల నిధులు మంజూ రు చేయించారు.

లే అవుట్‌ను గజిబిజి చేశారు

వైసీపీ హయాంలో దుమ్ములపేట లేఅవుట్‌ను గజిబిజి చేసి తిరిగి వేరే వారికి పట్టాలిచ్చారు. దీంతో ప్రధాన రోడ్ల వెంబడి పేదల ఇళ్లస్థలాల్లో షాపుల నిర్మాణాలు జరిగాయి. దీనిపై ప్రతిపక్షంలో ఉండగా కొండబాబు ఈ షాపులను పరిశీలించగా లబ్ధిదారులు తమ స్థలాలు ఇప్పించాలని వేడుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే 2017లో పట్టాలిచ్చిన వారందరికీ తిరిగి ఈ స్థలాలు అప్పగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. లేఅవుట్‌లోని 20 అడుగులు, 10 అడుగుల అంతర్గత రోడ్లను మార్చి వేశారు. ఎమ్మెల్యే కొండబాబు ఇళ్లస్థలాల అప్పగింతను కొలిక్కి తెస్తారని దుమ్ములపేటవాసులు ఎదురుచూస్తున్నారు.

నేడు జిల్లా నూతన కలెక్టర్‌గా షణ్మోహన్ బాధ్యతల స్వీకరణ



కలెక్టరేట్(కాకినాడ), జూన్ 23: సోమవారం జిల్లా నూతన కలెక్టర్‌గా సగిలి షణ్మోహన్ బాధ్యత స్వీకరిస్తానని, అనంతరం ఉదయం 10గంటలనుంచి కలెక్టర్ కార్యాలయం వివేకానంద సమావేశపు హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమం కింద వివిధ సమస్యలపై ప్రజలనుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. కాకినాడ కలెక్టరేట్‌తోపాటు జిల్లాలోని అన్ని డివిజనల్, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ నిర్వహిస్తామన్నారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమ అర్జీలు సంబంధిత అధికారుల కార్యాలయంలో అందజేయాలన్నారు.

జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం

నేటినుంచి ఆగస్టు 11వరకు పలు రైళ్లు రద్దు

వేట్లపాలెంలో అదుపులోకి డయేరియా


వేట్లపాలెం గ్రామంలో పారిశుధ్య పరిస్థితులను పరిశీలిస్తున్న ఎంపీడీవో తదితరులు

» ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారు 8మంది
» పైప్‌లైన్ లీకులే ప్రధాన కారణం

సామర్లకోట, జూన్ 23: సామర్లకోట మండలం వేట్లపాలెంలో విరేచనాలతో డయేరియా బారిన పడి ఆదివారం నాటికి ఇంకా 8మంది వ్యక్తులు వివిధ ఆస్పత్రులలో చేరి చికిత్స పొందుతున్నారు. కొత్తగా విరేచనాలతో బాధపడి ఆస్పత్రికి వచ్చిన వారు ఎవరూ లేరని సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్ ఆదివారం రాత్రి తెలిపారు. ఈ మేరకు అందించిన సమాచారం మేరకు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో బట్టేటి వెంకటేష్, బట్టేటి దేవి, కొమ్మన వివేన్, గెడ్డం మొక్షిత్, కాల్వ కుమారి, బట్టేటి శ్రీరామ సత్యసాయి సుభాష్ కాగా కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో పరిమి స్రవంతి, పరిమి దివ్య ఉన్నారు. గ్రామం అంతటా పైప్‌లైన్ లీకులను పూర్తిస్థాయిలో అరికట్టడమే గాక తాగునీటిని పూర్తిగా క్లోరినేషన్ చేసిన తర్వాతే ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు అనుసంధానం చేసి కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్నామని ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తెలిపారు. సామర్లకోట మండలంలోని అన్ని గ్రామాల్లో డయేరియా వ్యాప్తి చెందకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే గాక అన్ని తాగునీటి పథకాలను క్లోరినేషన్ చర్యలు చేపట్టి ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. కాగా గ్రామంలో డయేరియా వ్యాప్తికి గల కారణాలు ఇంకా నిర్ధారణ కావాల్సిఉందని ఎంపీడీవో తెలిపారు. బాధితులందరూ గ్రామంలోని జొన్నలదొడ్డి ప్రాంతానికి చెందిన వారని చెప్పారు. ఆదివారం రాత్రి నాటికి గ్రామంలో డయేరియా పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చిందని నిలకడగానే ఉందని చెప్పారు.

గ్యాస్ట్రో ఎంటెరిటిస్ కేసులుగా గుర్తించాం: డాక్టర్ పరదేశ్

వేట్లపాలెంలో విరేచనాలతో అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న కేసుల్లో ప్రధానంగా గ్యాస్ట్రో ఎంటెరిటిస్‌గా గుర్తించి సత్వరం వైద్య సేవలందించామని వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పరదేశ్ ఆదివారం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారికి అందించిన నివేదికలో స్పష్టం చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి ఆదేశాల మేరకు వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పరదేశ్ స్పందించారు. ఈ మేరకు నివేదికల కాపీని ఆంధ్రజ్యోతికి ఆదివారం అందజేశారు. డీఎంహెచ్‌వో, డీఐవో అధికారుల సూచనల మేరకు గ్రామంలో వ్యాధి వ్యాప్తిని అదుపులోకి తెచ్చేందుకు ఐదు సర్వేలైన్స్ టీసీ ఎంలను రూపొందించి ఇంటింటా పూర్తి సర్వే నిర్వహించామన్నారు. పీహెచ్‌సీలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేసి పటిష్టమైన చర్యలు చేపట్టామని డాక్టర్ పరదేశ్ ఆ నివేదికలో తెలిపారు. గ్రామంలో బేస్‌క్యాంపులో గుర్తించి చికిత్స అందించి తీవ్రతను బట్టి కేసులను కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేసి ఉన్నతాధికారులకు తగు చర్య నిమిత్తం నివేదించామన్నారు. గ్రామంలో తాగునీటి సరఫరాలో మెరుగైన చర్యలు తీసుకునేలా ఎంపీడీవో శ్యామ్‌సుందర్ తదితర ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్ అధికారులను అప్రమత్తం చేశామని డాక్టర్ పరదేశ్ తెలిపారు. గ్రామంలో పదివేలకు పైబడి జనాభా ఉన్నా జొన్నలదొడ్డి ప్రాంతంలోనే డయేరియా వ్యాప్తి చెందేందుకు తాగునీటి పైప్‌లైన్ లీకులు ప్రధాన కారణంగా నిర్ధారణ అయినట్లు తెలిసింది. మృతి చెందిన మహిళది కూడా జొన్నలదొడ్డి కావడం గమనార్హం. మృతురాలి ఇంటి సమీపాన పైప్‌లైన్ లీకులు నుంచి నీటి నమూనాలు సేకరించి విశ్లేషించగా నాలుగింటిలో ఒక నీటి నమూనా కలుషితమైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతోపాటు గ్రామ పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం.


డయేరియా బాధితులకు మంత్రి సుభాష్ పరామర్శ


ప్రభుత్వాస్పత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 23: డయేరియా బారినపడి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించారు. ఆయన వెంట కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఉన్నారు. ఈ సందర్భంగా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డాక్టర్లను మంత్రి ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వేట్లపాలెం నుంచి 16 మంది డయేరియా బారినపడి జీజీహెచ్‌లో చేరానని, చికిత్స పొందుతూ ఒక మహిళ మృతి చెందారని తెలిపారు. రాజమహేంద్రవరంనుంచి ఒక బాధితుడు ఇక్కడ చేరారన్నారు. గత ప్రభుత్వంలో అలసత్వంవల్ల ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌వద్ద ఈ విషయం ప్రస్తావించామన్నారు. సిటీ ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో సీజనల్ వారీగా వర్షాకాలం వస్తుందంటే తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయడం, వేసవి కాలంలో కాలువలలో పూడిక తీయడం వంటివి జరిగేవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో సీజన్ వ్యాధుల జాగ్రత్తలపై అసలు సమీక్షలే లేవన్నారు.



చుక్ చుక్ బండి... ఇలాగైతే ఎలాగండి!



ప్రజలకు ప్రధాన రవాణా సాధనాలు రైళ్లు. అయితే సుమారు రెండేళ్లుగా రైళ్లు ఎక్కాలంటే జనాలు బెంబేలెత్తిపోతున్నారు. ప్రయాణంలో నరకం చూస్తున్నారు. ఎందుకంటే ఏ రైలు ఎప్పుడొస్తుందో.. అసలు వస్తుందో రాదో.. ఒకవేళ అదృష్టం బాగుండి వచ్చినా గమ్యానికి ఎప్పుడు చేరుస్తుందో ఎవరూ చెప్పలేని పరిస్థితి. నిర్వహణ పేరుతో దారి మళ్లించ డం, తాత్కాలికంగా రద్దు చేస్తుండడంతో రైలు ప్రయాణం అయోమయంగా మారింది. ఇది చాలదన్నట్టు ఇప్పుడు రాజమండ్రి రైల్వేస్టేషను గుండా నడుస్తూ.. ప్రజాదరణ ఎక్కువగా కలిగిన 26 రైళ్లను ఏకంగా నెలన్నరపాటు రద్దు చేశారు.

- ఇప్పటికే ఉసూరుమంటున్న ప్రయాణికులు
- నేటి నుంచి ఏకంగా 26 రైళ్లు రద్దు
- నిర్వహణ పేరుతో నెలన్నర బంద్
- సుదూరాల నుంచి వచ్చే రైళ్లే దిక్కు
- వాటిలో కాలు పెట్టలేని దుస్థితి
- ఇంటర్ సిటీలు వేయాలని డిమాండ్
- కొత్త ఎంపీ పట్టించుకోవాలని అభ్యర్థన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తూర్పు, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, ఏఎస్ఆర్ జిల్లా ప్రయాణికుల కు అగచాట్లే.. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, బెంగళూరుకు రాకపోకలు సాగించే వాళ్లకు మరిన్ని తిప్పలు తప్పకపోవచ్చు. సింహాద్రి రైలును తాత్కాలికంగా రద్దు చేస్తేనే జనాలు అల్లాడిపోతారు. అలాంటి పరిస్థితుల్లో రత్నాచల్, సర్కారు, జన్మభూమి, లింక్, తిరుపతి-కాకినాడ బళ్లను ఆపేయడంవల్ల ప్రయాణికుల ఇబ్బందులు తారాస్థాయికి చేరే అవకాశం ఉంది. కారణాలేమైనా ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీలునడపాలనే డిమాండ్ వినవస్తోంది. తమ అవస్థలపై కొత్తగా ఎన్నుకున్న ఎంపీ పురందేశ్వరి దృష్టి సారించాలని గోదా రోళ్లు కోరుతున్నారు. ఏదేమైనా రైళ్ల గాడి తప్పడంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

చుక్‌చుక్ బండి ఎందుకిలా..

2023 జూన్ 2వ తేదీ రైల్వే చరిత్రలోనే దారుణమైన దుర్ఘటన. ఒడిషాలోని బాలాసోర్ వద్ద కోరమాండల్ మరో రెండు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 300 మందికిపైగా బలైపోయారు. దీంతో రైల్వే ఉలిక్కిపడింది. అత్యున్నత స్థాయిలో సమావేశాలు జరిగాయి. భద్రతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని.. ట్రాక్, సిగ్నల్స్ వంటి కీలకమైన విభాగాలకు నిర్వహణ (మెయింటెనెన్స్)కు తగు సమయం కేటాయించాలని నిర్ణయించారు. ఆ మేరకు పనులు ఆరంభించారు. వీటి కోసం రోలింగ్ బ్లాక్ కారిడార్ పేరుతో రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడం, దారి మళ్లించడం చేస్తున్నారు. నాటి నుంచి మెయింటెనెన్స్ అని బ్లాక్(ఆ ట్రాక్‌పై రైళ్లను రద్దు చేయడం) తీసుకొంటున్నారు. కానీ పనులు వేగంగా చేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల్లో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. ఉదాహరణకు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లో రెండో ప్లాట్‌ఫాం ట్రాక్‌కి మరమ్మతులు పూర్తిచేశారు. ప్లాట్‌ఫాం మరమ్మతులు పూర్తి చేయడంలో జాప్యం జరుగుతోంది. దీంతో ట్రాక్ సిద్ధమైనా ప్రయాణికుల రైళ్లను నడపలేని పరిస్థితి నెలకొంది.

అసలే అంతంత మాత్రం..

రాజమండ్రి రైల్వే స్టేషను ద్వారా ప్రతి రోజూ 10 వేల మంది వరకూ ప్రయాణాలు సాగిస్తున్నారు. వీరిలో ఉభయగోదావరి జిల్లాలకు చెందిన ప్రజలు ఉంటారు. ప్రయాణికులు ఎక్కువగా రాకపోకలు సాగించే రైళ్లతో పాటు మొత్తం 26 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. కడియం-నిడదవోలు మధ్య పూర్తిస్థాయిలో మరమ్మతులంటూ కారణంగా చూపుతున్నారు. అయితే రద్దు చేసే బదులు ఆయా స్టేషన్లను మినహాయించి నడిపే ఆలోచన చేశారో లేదో అనేది ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఇప్పటికే బెంగళూరు వెళ్లే వారికి ఇటు నుంచి అటు నుంచి సరైన రైళ్లు లేవు. హతియా-హౌరా-న్యూతిన్సూకియా, టాటా, భువనేశ్వర్ నుంచి ఉన్నాయి. అమృత్ భారత్ సోమవారం ఇటు నుంచి మంగళవారం అటు నుంచి ఉంది. కాకినాడ నుంచి బెంగళూరుకు ఉన్న శేషాద్రి మాత్రమే ఈ ప్రాంతం వాళ్లకు దిక్కు. భువనేశ్వర్ నుంచి వచ్చే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ బుధవారం రాజమ హేంద్రవరం వస్తోంది. ఈ రైలుకి 20 రోజులు ముందు టికెట్ చేయించుకుంటే రూ.2 వేలు అవుతుంది. ముజఫర్‌పూర్, న్యూతిన్సూకియా, భువనేశ్వర్ నుంచి వారానికి ఒకసారి, గువాహటి నుంచి వారానికి మూడుసార్లు రైళ్లు ఉన్నా బోగీల్లో కాలు పెట్టడానికి వీలుండదు. జన్ సాధారణ్ రైళ్లు ఉన్నాయని రైల్వే చెబుతున్నా అవి గువాహటి, హౌరా వంటి సుదూర ప్రాంతాల నుంచి ఉండడంతో అక్కడ బోగీలు నిండిపోతాయి. ఈ ప్రాంతం వాళ్లకు వాటితో ఎలాంటి ఉపయోగమూ లేదు. చెన్నైకి టాటా, ధన్‌బాద్, పురూలియా, న్యూతిన్సూకియా, షాలిమార్(కోరమాండల్), హౌరా, భువనేశ్వర్ నుంచి ఉన్నాయి. హౌరా-కన్యాకుమారి, భువనేశ్వర్-పుదుచ్చేరి, ముజఫర్ పూర్-జోలార్‌పెట్టై వరకూ వారానికి ఒకసారి, సిల్చార్-కోయంబత్తూరు, భువనేశ్వర్-చెన్నై, జసిద్-తాంబరం(గురు), ఖరగ్‌పూర్- విల్లుపురం, భువనేశ్వ ర్-రామేశ్వరం, విశాఖ-చెన్నై (శుక్ర), హౌరా-తిరుచిరా పల్లి(సోమ,శుక్ర) గువాహటి నుంచి మూడురోజులు జోలార్‌పేట్ వరకూ, షాలిమార్- త్రివే ంద్రం (మంగళ, బుధ) ఉన్నాయి. సంత్రాగచి-చెన్నై ఏసీ ఎక్స్‌ప్రెస్ బుధ, శనివారాల్లో నడుస్తోంది. వీటిలో బెర్తులు దొరకాలంటే అదృష్టాన్ని నమ్ముకోవాల్సిందే. హైదరాబాద్‌కి వందే భారత్(ఆదివారం మినహా) వేసినా దానికి సమయపాలన ఇంకా అలవాటు పడలేదు. పైగా చైర్‌కార్ రూ.1425, ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ రూ.2535 ధరలు ఉండడంతో సామాన్యుడు ఎక్క లేని పరిస్థితి ఉంది. మరో వందే భారత్(గురువారం మినహా) నడుస్తోంది. భువనేశ్వర్, హౌరా, షాలిమార్ నుంచి వచ్చే రైళ్లలో అడుగు పెట్టడానికి వీలుండదు. ఇప్పుడు జన్మభూమి, కోకనాడను తాత్కాలింకగా రద్దు చేయడంతో గౌతమి, గోదావరిపై మరింత ప్రయాణికుల భారం పడనుంది.

రద్దు చేసిన రైళ్లు ఇవే..

ఈనెల 24 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకూ 26 రైళ్లను రానుపోను తాత్కాలికంగా నిలిపివేశారు. రైలు నెం.07466, 07467 (రాజమండ్రి-విశాఖ మెము), 17257, 17258 (కాకినాడ-విజయవాడ మెము), 17219, 17220 (మచిలీపట్నం-విశాఖ), 17249, 17250 (తిరుపతి-కాకినాడ), 17239, 17240(సింహాద్రి), 17243, 17244(రాయగడ), 12861, 12862(లింక్ దక్షిణ్), 12717, 12718(రత్నాచల్), 12805, 12806(జన్మభూమి), 17643, 17644(సర్కారు), 22701, 22702(ఉదయ్), 12775, 12776(కోకనాడ), 22707, 22708(విశాఖ-తిరుపతి డబుల్ డెకర్) రైళ్లు 47 రోజుల పాటు రాకపోకలు సాగించవు. ఈ మేరకు ఫిబ్రవరి 19వ తేదీనే ఆదేశాలు జారీ అయ్యాయి. టీసీఐ, టీఎఫ్‌టీఆర్, పీక్యూఆర్ఎస్ పనుల కోసం రైళ్లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గంట ఆలస్యంగా గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు



సామర్లకోట, జూన్23: కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారంరాత్రి గంట ఆలస్యంగా కాకినాడనుంచి బయలుదేరి సామర్లకోటకు చేరుకుంది. లింగంపల్లి నుంచి కాకినాడ వచ్చే గౌతమి ఎక్స్‌ప్రెస్ ఆదివారం ఉదయం సుమారు 270 నిమిషాలు ఆలస్యంగా సామర్లకోటచేరుకుని కాకినాడపోర్టుకు చేరుకుంది. సాధారణ నిర్వహణలో భాగంగా గంట ఆలస్యంగా తిరిగి లింగంపల్లికి బయలుదేరింది. దీంతో నిర్దేశిత సమయం రాత్రి 7.10 నిమిషాలకు కాకినాడ నుంచి బయలుదేరాల్సి ఉన్నప్పటికీ గంట ఆలస్యంగా రాత్రి 8.10కు బయలుదేరింది. విజయ వాడ రైల్వే సెక్షన్‌లో వివిధ అభి వృద్ధి పనులలో భాగంగా గౌతమి రైలు రీషెడ్యూల్ చేయాల్సివచ్చి నట్లు రైల్వే సీపీటీఎం (విజయవాడ) అధికారి ఆదివారం రాత్రి తెలిపారు. దీంతో సామర్లకోట తదితర రైల్వే స్టేషన్లలో వివిధ ప్రాంతాల కు వెళ్లే ప్రయాణికులకు ముందస్తు సమాచారం లేకపోవ డంతో గంటసేపు రైల్వేస్టేషన్లో ఎదురుచూపులు చూడాల్సి వచ్చింది.

భగవంతుని ఆరాధనతోనే

మానసిక ప్రశాంతత

'మహా సహస్రావధాని' డాక్టర్ గరికపాటి నరసింహారావు


ప్రవచనాలు ఇస్తున్న డాక్టర్ గరికపాటి

మండపేట, జూన్ 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేటలోని ధర్మ గుండం చెరువువద్ద ఉన్న రామాలయం కమిటీ సారథ్యంలో సీతారామ కల్యాణ మండపంలో 'మహా సహస్రావధాని' డాక్టర్ గరికపాటి నరసింహారావు మూడురోజుల ప్రవచనాలు ఆదివారంతో ముగిశాయి. భగవంతుని ఆరాధనతోనే మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు. జీవుల పట్ల మానవత, దయా హృదయం కలిగి ఉండాలని కోరారు. సమాజంలో కులతత్వం పోవాలన్నారు. అందరూ సమానమేనన్న భావన ప్రతిఒక్కరిలోనూ రావాలన్నారు. నేటి సమాజంలో జరుగు తున్న వాస్తవాలను గరికపాటి తనదైనశైలిలో వివరించారు. రాష్ట్రంలో పాలన, ప్రజల ఇబ్బం దులను ఆయన వివరించిన తీరు ఆకట్టుకుంది. ఎందరో మహనీయులు, భగవత్ స్వరూపులు వున్న జిల్లా ఉమ్మడి తూర్పుగోదావరి అన్నారు. జిల్లాలోని శివాలయాల ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. పిఠాపురం కుక్కుటేశ్వరస్వామి ఆలయ విశిష్టత, శివతత్వం, గోమాత విశిష్టతలను తెలియజెప్పారు. ఆవు గడ్డి తిని పాలు ఇస్తుంటే ప్రభుత్వ ఉద్యోగి మాత్రం లంచం అంటూ అంటకాగుతున్నాడని, ఆ విధానం మానుకోవాలని పిలుపునిచ్చారు. మానవసేవే మాధవసేవగా సమాజంలో అందరూ మానవ సేవ ద్వారా దైవసేవ చేసి వారి ఆశీస్సులు పొందిననాడే వారికి పుణ్యఫలాలు దక్కుతాయన్నారు. దేవాలయాలకు వెళ్లినప్పుడు భక్తులు కోరికలు కోరకుండా భగవంతుడు ఇచ్చిన వాటినే స్వీకరించాలన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి పాలన అందించాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. మాండవ్యపురం విశిష్టతను కూడా వివరించారు. మాండవ్యముని గురించి, డొక్కా సీతమ్మ గురించి ప్రసంగిం చారు. అనంతరం గరికపాటిని కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. వేద పండితులు వేదాశీర్వచనాలు అందించారు. మూడు రోజులపాటు జరిగిన ప్రవచనాల్లో నిర్వాహకులు ఇనపకోళ్ల అబ్బు, వల్లూరి నల్లబ్బు, విజ్ఞాన్ రాంబాబు, పలువురు సభ్యులు, పట్టణ ప్రముఖులు, అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సత్యదేవుడిని దర్శించుకున్న పాతపట్నం ఎమ్మెల్యే


ఎమ్మెల్యే గోవిందరావుకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న పీఆర్వో

అన్నవరం, జూన్ 23: సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం ఎమ్మెల్యేగా కూటమి తరుపున పోటీచేసి గెలుపొందిన మామిడి గోవిందరావు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు.

పాదగయలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే పూజలు


పాదగయ క్షేత్రంలో రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పిఠాపురం, జూన్ 23: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఆదివారం సాయంత్రం సందర్శించారు. పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్రప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆలయ అధికారులు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట పాదగయ మాజీ చైర్మన్ ఆగంటి ప్రభాకరరావు, బీజేపీ నాయకుడు పెండెం సత్యనారాయణ, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

డయేరియాని ఎదుర్కోండి


బెండపూడిలో మూసివేసిన బావిని పరిశీలిస్తున్న డైరెక్టర్ పద్మావతి

- వ్యాధిని గుర్తించిన వెంటనే పీహెచ్‌సీకి తరలించాలి
- ప్రతిరోజు తాగునీటి శాంపిళ్లు సేకరించాలి
- నిరంతర ఇంటింటి సర్వే చేయాలి
- ఏపీ హెల్త్ డైరెక్టర్ పద్మావతి

తొండంగి, జూన్ 23: గ్రామస్థాయిలో అన్నిశాఖలు సమన్వయంతో పనిచేసి డయేరియా వ్యాధిని పూర్తిగా ఎదుర్కోవాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. ఆదివారం ఆమె కొమ్మనాపల్లి, బెండపూడి గ్రామాల్లో పర్యటించి సిబ్బందితో సమావేశమయ్యారు. కొమ్మనాపల్లిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో డయేరియా ఇతర వ్యాధులు ప్రబలుతున్నందున ఆరోగ్య సిబ్బంది అప్రమత్తం కావాలన్నారు. గ్రామాల్లో పంచాయతీ ఆర్‌డబ్ల్యుఎస్,తదితర శాఖల సిబ్బందితో కలిసి ఆరోగ్య సిబ్బంది గ్రామస్థాయిలో కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు ప్రతిరోజు తాగునీటి వనరుల ప్రారంభస్థాయి, మధ్య, ముగింపు స్థాయిలవద్ద శాంపిళ్లు సేకరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ఆశ,హెల్త్ వర్కర్లు ఇంటింటి సర్వే చేయాలన్నారు. ఎవరైనా ఏదైనా రోగానికి గురైతే పీహెచ్‌సీకి తీసుకువెళ్లి అప్పగించాలన్నారు. తాగునీటి వనరులు కలుషితం కారణంగా రోగాలు వ్యాప్తి చెందుతున్నందున పంచాయతీ సిబ్బందితో కలిసి పైప్‌లైన్ లీకేజీ, క్లోరినేషన్ వంటి కార్యక్రమాలు పర్యవేక్షించాలన్నారు. డయేరియా వ్యాధి పూర్తిగా అదుపులోకి వచ్చేంత వరకూ శిబిరాలను కొనసాగించాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామంలో ప్రస్తుత పరిస్థితిని వైద్యులు రవికుమార్, భారతిలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ కోన సూర్యనారాయణ అమ్మాజీని పంచాయతీ పరంగా తీసుకున్న చర్యల గురించి అడిగి పలు సూచనలు చేశారు. రీజనల్ డైరెక్టర్ పద్మ శశిధర్, డీఎంహెచ్‌వో నర్సింహనాయక్, అదనపు డీఎంహెచ్‌వో రమేష్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమె బెండపూడిగ్రామంలో పర్యటించి సిబ్బందితో సమావేశమయ్యారు. గ్రామంలో మూసివేసిన బావిని పరశీలించి పలు సూచనలు చేశారు.

స్టాప్ డయేరియాని విజయవంతం చేయాలి

సమీకృత డయేరియా నియంత్రణ (స్టాప్ డయేరియా) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని హెల్త్ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. బెండపూడిలో ఆమె మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకూ రెండు నెలల పాటు కార్యక్రమం అమలు జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాలలోపు వయస్సున్న పిల్లల్లో డయేరియా వ్యాధి నివారణకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ వర్కర్లు ఆరోగ్యసిబ్బంది ఇంటింటికీ వెళ్లి అవగాహన కలిగించాలన్నారు. జూలై 18 నుంచి ప్రారంభమై 31 వరకూ జరిగే లెప్రసీ సర్వేను కూడా గ్రామస్థాయిలో విజయవంతం చేయాలన్నారు,

త్వరలోనే పిఠాపురంలో పవన్ పర్యటన

- తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రాధాన్యం
- జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు


ఇల్లింద్రాడ వద్ద కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న నాగబాబు

పిఠాపురం, జూన్ 23: జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మూడు, నాలుగు రోజుల్లో పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించనున్నారని జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు తెలిపారు. పిఠాపురం పట్టణ శివారు ఇల్లింద్రాడ వద్ద గల రైసుమిల్లులో ఆదివారం సాయంత్రం ఆయన జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. గొల్లపల్లి పెదబాబీ ఆధ్వర్యంలో జనసేన నేతలు నాగబాబును ఘనంగా సత్కరించారు. తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజలను కలుసుకోవాలనే ఆత్రుతతో పవన్ ఉన్నారని తెలిపారు. ఉపముఖ్యమంత్రిగా, ఐదుశాఖల బాధ్యతలు ఆయనపై ఉన్నాయని, వాటికి న్యాయం చేస్తూనే నియోజకవర్గంలో పర్యటిస్తారని చెప్పారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని పవన్ నెరవేరుస్తారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నూరుశాతం ఆయన నెరవేరుస్తారని తెలిపారు. పిఠాపురం నియోజకవర్గానికి ఏదొకటి చేసిన తర్వాతే గెలుపు సంబరాలు చేసుకోవాలన్న ఆలోచనలో పవన్ ఉన్నారని చెప్పారు. పవన్‌ను మీ ఇంటి వ్యక్తిగా స్వీకరించాలని ఆయన పిఠాపురం ప్రజలను కోరారు. నియోజకవర్గ పరిధిలో జరిగే అక్రమ మైనింగ్‌ను అడ్డుకోవాలని, గంజాయి బ్లేడ్‌బ్యాచ్‌లు కనిపిస్తే పోలీసుస్టేషన్‌లో అప్పగించాలని సూచించారు. ఎన్నికల ముందు కొంతమంది వైసీపీ నాయకులను తీసుకున్నామని, ప్రజలకు ఉపయోగపడే వారు వచ్చి చేరతామంటే ఆలోచిస్తామని తెలిపారు. చాలామంది వైసీపీ కార్యకర్తలు గత ఎన్నికల్లో జనసేనకు పరోక్షంగా సహకరించారని చెప్పారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారు పార్టీలో చేరతామంటే మాత్రం రెడ్‌మార్క్ వేసి ఆపివేస్తామని తెలిపారు. ఎవరు పార్టీలో చేరినా తొలిప్రాధాన్యం మాత్రం జనసేన, టీడీపీ కార్యకర్తలకే ఉంటుందని స్పష్టం చేశారు. మనకు తెలుగుదేశంతో ఎటువంటి విభేదాలు లేవని తేల్చి చెప్పారు. ప్రజల కోసం పవన్ ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు, పలువురు జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు. కాగా గొల్లప్రోలు సొసైటీ ద్వారా రుణాలు తీసుకుని పంటలు నష్టపోయిన రైతులకు 2019-20లో పంటల భీమా పరిహారం ఇప్పటివరకూ అందలేదని, నాలుగు శాతం వడ్డీ రాయితీ సక్రమంగా అందడం లేదని సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల ఏసువెంకటరమణ నాగబాబు దృష్టికి తీసుకువచ్చి వినతిపత్రం అందజేశారు.



నేడు కుమార రామ భీమేశ్వరుడికి అభిషేకాలు

సామర్లకోట, జూన్ 23: పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమార రామ భీమేశ్వరా లయంలో శివలింగానికి భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారుల అనుమతుల మేరకు నేడు సోమవారం నుంచి అభిషేక పూజలు పునరుద్ధరించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం చెప్పారు. గత సోమవారం నుంచి మూలవిరాట్‌కు పూజలు, దర్శనాలకు అనుమతులు ఇచ్చినప్పటికీ శివలింగానికి అభిషేక పూజలకు మాత్రం అనుమతులు లభించలేదు. అధిక సంఖ్యలో భక్తుల విజ్ఞాపనల మేరకు భారతీయ పురావస్తుశాఖ ఉన్నతాధికారులు అభిషేక పూజలకు సోమవారం నుంచి అనుమతులు మంజూరు చేశారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. ఆలయ ఈవో భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రీజెన్సీ విధ్వంసం కేసులో

ఇద్దరు అధికారులకు జైలు

యానాం, జూన్ 23: యానాంలో సంచలనం కలిగించిన రీజెన్సీ సంఘటనకు సంబంధించి కేసుల్లో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు కోర్టు జైలుశిక్ష విధించింది. 2012లో జరిగిన ఈ సంఘటనలో యూనియన్ నాయకుడు మృతి, యాజమాన్యానికి చెందిన ప్రతినిధి హత్య, పరిశ్రమ ధ్వంసానికి సంబంధించి పలు కేసులు నమోదయ్యాయి. అనంతరం సీబీఐ విచారణ జరిగింది. పరిశ్రమను తగులబెట్టిన ఘటన, పోలీస్‌స్టేషన్‌లో కార్మిక నాయకుడు మృతి కేసుల్లో ఇద్దరు పోలీసు అధికారులకు పుదుచ్చేరి సీజేఎం కోర్టు రెండేళ్ల జైలు శిక్ష, రూ.4వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ కేసులో అప్పటి సీఐ పెరియస్వామి (ప్రస్తుతం ఉద్యోగ విరమణచేశారు), ప్రస్తుతం పుదుచ్చేరిలో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వీరభద్రస్వామి ఉన్నారు. ఈ సంఘటన యానాంలో మాయని మచ్చగా మిగిలిపోయింది. ప్రస్తుతం పరిశ్రమ పునఃప్రారంభిస్తున్న నేపథ్యంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. మిగిలిన కేసుల్లో తీర్పు ఏమిటనేది తీవ్ర చర్చకు దారితీస్తోంది.


పిల్లలతో తల్లి గోదావరిలో దూకే యత్నం

- ప్రాణాలను కాపాడిన పోలీసులు


బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

ఐ.పోలవరం, జూన్ 23: కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక తల్లి ఇద్దరు పిల్లలతో గోదావరిలో దూకేందుకు ప్రయత్నించగా సమాచారం అందుకున్న ఐ.పోలవరం పోలీసులు సమయస్ఫూర్తితో వారిని రక్షించారు. కాకినాడకు చెందిన చింతలపూడి గీతాంజలి భర్తపై కోపంతో తన ఇ ద్దరు పిల్లలతో కలిసి శనివారం రాత్రి బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఐ.పోలవరం మండలం ఎదురులంక బ్రిడ్జిపై నుంచి గోదావరిలో దూకేందుకు ప్రయత్నిస్తుండగా అటు గా వెళ్తున్న ప్రయాణికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ, కానిస్టేబుల్ విజయకుమార్ వెంటనే వచ్చి వారి ప్రాణాలను రక్షించారు. కుటుంబ సభ్యులకు వారిని అప్పగించారు. పోలీసుల సమయస్ఫూర్తిని ప్రజలు ప్రశంసించారు.

'లోవ'లో భక్తుల సందడి


ఆలయ ప్రాంగణంలో భక్తులు రద్దీ

తుని రూరల్, జూన్ 23: ప్రసిద్ధిపుణ్యక్షేత్రంలో లోవదేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. అమ్మవారి దర్శనార్థం తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా వచ్చిన భక్తులతో ఆలయానికి రావడంతో భక్తులతో కిక్కిరిసింది. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు అమ్మవారికి దర్శించుకుని మొక్కులు చెల్లించుఉని ఆలయప్రాంగణంలో గల ఆరుబయట మామిడితోటల్లో, వసతి గృహాల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భజనాలు చేశారు. ఆదివారం ఒక్కరోజు భక్తుల ద్వారా వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.4.92లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాధ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజా ఆకాంక్షల మేరకు నూతన ప్రభుత్వ పాలన

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, చిత్రంలో సిటీ ఎమ్మెల్యే కొండబాబు తదితరులు

కాకినాడసిటీ, జూన్ 23: రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం ప్రజా ఆకాంక్ష మేరకు సక్రమ మైన పరిపాలన అందిస్తోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఆది వారం తొలిసారిగా కాకినాడకు విచ్చేసిన మంత్రి సుభాష్ స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను గాలికి వదిలేయడంతో ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. నవరత్నాలు పథకాలను ఊదరకొడుతూ 175 సీట్లు వస్తాయని జగన్మోహన్‌రెడ్డి కలలు కన్నారన్నారు. 2014నుంచి 2019 వరకు చంద్రబాబు పాలనలో చంద్రన్న బీమా పథకం ద్వారా 2 కోట్ల 16 లక్షల మంది లబ్ధి పొందారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేవలం కోటి 25 లక్షల మందికి మాత్రమే సాయం అందించారన్నారు. అదే విధంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ కార్పొరేషన్‌లను వైసీపీ నిర్వీర్యం చేసిందన్నారు. ఇవన్నీ గమనించిన ప్రజలు రాష్ట్రంలో కూటమికి భారీ మెజారిటీతో అధికారం కట్టబెట్టారన్నారు. గెలిచిన ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రజలను కలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయా లని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లలో ఇసుక దోపి డీ చేశారని, సామాన్య ప్రజలకు ఇసుక దొరక్కపోవడంవల్ల ఆ ప్రభావం భవననిర్మాణ కార్మికులపై పడిందన్నారు. ఇసుకకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలసీని తీసుకురానుందన్నారు. దీని వల్ల భవన నిర్మాణ కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అంతేతప్ప కూటమి ప్రభుత్వంలో కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. కార్మికులకు చెందాల్సిన రూ.3 వేల కోట్లు వైసీపీ ప్రభుత్వంలో దారి మళ్లించారన్నారు. లిక్కర్, ఇసుక దోపిడీతో రాష్ట్రాన్ని లూటీ చేశారని మంత్రి సుభాష్ మండిపడ్డారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ టీడీపీ ఎజెండాలో పొందుపరిచిన మూడు గుర్తులు గృహం, చక్రం, నాగలి పేద బడుగువర్గాల శ్రేయస్సును చాటుతున్నాయన్నారు. ఈ గుర్తులు కార్మికుల ప్రాధాన్యతను, రైతుల ప్రాధాన్యతను, గృహ నిర్మాణం ప్రాధాన్యతను తేటతెల్లం చేస్తున్నాయన్నారు. కార్మికుల శ్రేయస్సు కోసం టీడీపీ ప్రభుత్వం ఎంతో పాటుపడిందన్నారు. అటువంటి ముఖ్యమైన కార్మికశాఖ మంత్రి బాధ్యతను సుభాష్‌కు అప్పగించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కార్మికుల సమస్యలను మంత్రి పరిష్కారానికి కృషి చేయనున్నారన్నారు. అదేవిధంగా చంద్రన్న బీమా అందరికీ అందేలా దృష్టి సారించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కార్మికులకు అండగా ఉండి కార్మికుడు బాగుపడేలా ఈ ప్రభుత్వం ముందుకు పయనిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీడీపీ ఆరోగ్య విభాగం సభ్యు డు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాసబాబా, నగర టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, నాయకులు పప్పు దుర్గారమేష్, సుందరపల్లి గోపాలకృష్ణ, అనసూరి సతీష్, కొలిక్కిగడ్డ గంగరాజు, తెల్రగాపు లక్ష్మీగణేష్, జొన్నాడ వెంకటరమణ, చోడిపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

నేటి నుంచి ఆగస్టు 11వరకు పలు రైళ్లు రద్దు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 23: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని నిడదవోలు, కడియం మధ్య ఆధునికీకరణ పనుల కారణంగా ఈనెల 24 నుంచి ఆగస్టు 11 వరకు సర్కార్, కోకనాడ, కాకినాడ లింగంపల్లి స్పెషల్ రైళ్లను రద్దు చేశారు. ఇప్పటికే తిరుపతి, కాకినాడ రైలును రద్దు చేసినట్టు రైల్వే శాఖాధికారులు తెలిపారు. వారాంతపు రైళ్లు కాకినాడ భావనగర్, కాకినాడ ముంబై లోకమాన్య తిలక్, కాకినాడ శిరిడిసాయినగర్ నడవనున్నాయి.

'పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు'

గొల్లప్రోలు రూరల్, జూన్ 23: పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని జనసేన ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు తెలిపారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. స్థానిక ఎన్నికల్లో జనసేన కోసం పనిచేసినవారికి ప్రాధాన్యత ఉంటుందని, అదే సమయంలో పొత్తు ధర్మాన్ని గౌరవిస్తూ టీడీపీ, బీజేపీలకు అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత పార్టీపై ఉందని చెప్పారు. వైసీపీ నేతలు కేంద్రం నుంచి పంచాయతీలకు వచ్చిన నిధులను దోచేశారని, దీంతో సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితికి దారితీసిందన్నారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి వేములపాటి అజయకుమార్, నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'సూర్యారావు స్ఫూర్తితో ముందుకు సాగాలి'

పెద్దాపురం, జూన్ 23: ప్రజాకవి, కార్మిక నాయకుడు యాసలపు సూర్యారావు స్ఫూర్తితో ముందుకు సాగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు అన్నారు. ఆదివారం స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో సూర్యారావు 12వ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కవితా గోష్ఠి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం, దువ్వా శేషుబాబ్జి, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోష్యుల కృష్ణబాబు, కొత్త శివ, సిరిపురపు శ్రీనివాస్, బుద్దా శ్రీనివాస్, నీలపాల సూరిబాబు, యాసలపు రమేష్, కేదారి నాగు, రవి, బంగార్రాజు తదితరులు పాల్గొన్నారు.

'జీజీహెచ్‌లో పడకల సంఖ్య పెంచాలి'

సర్పవరం జంక్షన్, జూన్ 23: కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి (జీజీహెచ్)లో చికిత్స కోసం వేలాది రోగులు వస్తున్నారని, ఇన్‌పేషెంట్ల కోసం పడకల సంఖ్య పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను జిల్లా యువజన సంఘాల కార్యదర్శి, సామాజిక కార్యకర్త గేదెల శ్రీనివాస్ కోరారు. ఆదివారం జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శించేందుకు విచ్చేసిన మంత్రి సుభాష్‌ను కలుసుకుని వినతి పత్రం అందించారు.

'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

ప్రత్తిపాడు, జూన్ 23: మాదకద్రవ్యాలకు గ్రామీణ ప్రజలు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సెబ్ సీఐ ఎల్.చిరంజీవి కోరారు. ధర్మవరం నంది సెంటర్ 3వ సచివాలయం వద్ద ఆదివారం మాదకద్రవ్యాలపై గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో భాగస్వామ్యం అవతామని గ్రామస్తులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వీఆర్వో బి.రాజేష్, సెబ్ కానిస్టేబుల్స్ వీరభద్రరావు, రాంబాబు, ఎక్సైజ్, రెవెన్యూ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

'యువత ఆరోగ్యాలు పాడుచేసుకోరాదు'

తాళ్లరేవు, జూన్ 23: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు యువత మత్తు పదార్థాలకు బానిసలై ఆరోగ్యాలను పాడుచేసుకోరాదని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సెబ్‌స్టేషన్ ఎస్ఐ చిట్టిబాబు అన్నారు. ఆదివారం నీలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిట్టూరి నాగమణి అధ్యక్షతన మదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించగా ఎస్ఐ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దంగేటి సూరిబాబు, ఉప సర్పంచ్ వస్కా రెడ్డి, పిల్లి సత్తిబాబు, గంటా గోపి తదితరులు పాల్గొన్నారు.

'తాళ్లరేవు మండలాన్ని అభివృద్ధి చేయాలి'

తాళ్లరేవు, జూన్ 23: తీరప్రాంతంలో ఉన్న చమురు సంస్థలు సీఎస్ఆర్ నిధులతో తాళ్లరేవు మండల కేంద్రాన్ని యూనిట్‌గా తీసుకుని అభివృద్ధి చేయాలని టీడీపీ బీసీ సాధికార సంఘం నేతలు పిల్లి సత్తిబాబు, గంజా సూరిబాబు ఆదివారం ఒకప్రకటనలో డిమాండ్ చేశారు. కోట్లు విలువచేసే గ్యాస్ నిక్షేపాలను ఇతరరాష్ట్రాలకు తరలించుకుపోతూ తాళ్లరేవు మండలాన్ని చమురు సంస్థలు నిర్లక్ష్యం చేయడం చాలా బాధాకరమని, ఈ విషయంపై ప్రజాఉద్యమం చేసేందుకు కార్యాచరణ చేపడతామన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతి...!



కరప మండలంలో బురదమయంగా మారిన యండమూరు-జి.బావారం రోడ్డు

కరప, జూన్ 23: మట్టి మాఫియా స్వార్థం... ప్రయాణికుల పాలిట శాపంగా పరిణమించింది. నిబంధనలను అతిక్రమించి ట్రాక్టర్లపై తరలించిన చేలల్లో మట్టి రహదారులపై చిందర వందరగా పడిపోయింది. ఆ రహదారులపై రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహనదారులు పట్టుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. చేలల్లో మట్టిని ట్రాక్టర్లపై తరలించే సమయంలో డ్రైవర్లు కనీస జాగ్రత్తలు పాటించడంలేదు. వర్షాలకు రోడ్లపై పడిన మట్టి బురదగా మారి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పొలాల మట్టిని యథేచ్ఛగా బట్టీలకు, లేఅవుట్‌లకు తరలించి సొమ్ములు చేసుకున్నారు. ఇప్పుడు ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు బురదమయంగా తయారై ప్రమాదాలకు ఆలవాలంగా నిలిచాయి. రోడ్లపై ఉన్న బురదను తొలగించకపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కారకులపై చర్యలు తీసుకోవాలని, రోడ్లపై ఉన్న బురదను తొలగించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధ్వానంగా రహదారి

రౌతులపూడి: రౌతులపూడి-శంఖవరం రహదారి అధ్వానంగా ఉంది. రహదారి పొడవునా పెద్దపెద్ద గోతులు పడడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. క్వారీ మేటల్ తరలించే భారీ వాహనాలు తిరగడంతో రహదారి గోతులుపడుతున్నాయి. మేరకచామవరం, శృంగవరం గ్రామాల మధ్య ఇటీవల కురుస్తున్న వర్షాలకు నీరుచేరి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కనీసం గోతుల్లో గ్రావెల్ అయినా వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వర్షాలకు బురదమయమైన రోడ్లు

పట్టుతప్పి పడిపోతున్న వాహనదారులు

రోడ్లు మురుగుమయం

గండేపల్లి, జూన్ 23: మండలంలో ఆదివారం ఉదయం కురిసిన వర్షానికి మల్లేపల్లిలో మురికినీరు రోడ్లపై చేరింది. దీంతో రోడ్లపై నడాలంటే గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆ నీటి వల్ల దోమలు విపరీతంగా పెరిగి రోగాలు వ్యాప్తిచెందుతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రౌతులపూడి - శంఖవరం రహదారి



గండేపల్లి: మల్లేపల్లిలో రోడ్డుపై చేరిన మురుగునీరు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన బాబా



సర్పవరం జంక్షన్, జూన్ 23: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావును ఆదివారం విజయవాడలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కాకినాడ రూరల్ జనసేన అభ్యర్థి పంతం నానాజీ గెలుపు కోసం కూటమి నాయకులు, కార్యకర్తలు కృషి చేశారని తెలిపారు.

నాగబాబును కలిసిన తుమ్మలపల్లి



జగ్గంపేట, జూన్ 23: జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబును జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ మర్యాద పూర్వకంగా కలిశారు. డిప్యూటీ సీఎం పవన్ అసెంబ్లీలో ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసారి నాగబాబు పిఠాపురం విచ్చేసిన సందర్భంగా కలిశారు.

మంత్రులను కలిసిన ధూళిపూడి



మంత్రి లోకేశ్‌ను అభినందిస్తున్న ధూళిపూడి

తాళ్లరేవు, జూన్ 23: టీడీపీ రాష్ట్ర తెలుగుయువత కార్యదర్శి ధూళిపూడి వెంకటరమణ ఆదివారం అమరావతిలో రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వాసంశెట్టి సుభాష్, కింజారపు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, కొల్లు రవీంద్రలను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీకి రాజీనామా

పెద్దాపురం, జూన్ 23: వైసీపీకి మండలంలో వాలుతిమ్మాపురానికి చెందిన వైసీపీ దళిత నాయకుడు బచ్చల రాజు రాజీనామా చేశారు. రాజీనామా లేఖను నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబుకు అందజేశారు. వైసీపీ విధానాలు నచ్చక రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

నేడు మరిడమ్మ ఆదాయం లెక్కింపు

పెద్దాపురం, జూన్ 23: మరిడమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని సోమవారం దేవదాయశాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో లెక్కించనున్నట్టు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు.

సత్తెమ్మకు విశేష పూజలు

సామర్లకోట, జూన్ 23: సామర్లకోట సత్యన్నారాయణపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపాన ఉన్న సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకురాలు రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ప్రతినిధి, నీలిమా హోటల్ అధినేత అమలకంటి శ్రీనివాసరావు తదితరులతో అమ్మవారికి నవవర్ణార్చన, పుష్పార్చన పూజలు నిర్వహించారు. 6 రకాల ప్రసాదాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. నూతన పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. 9 కోళ్లను అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాద వితరణ జరిగింది.

గొల్లప్రోలులో పాదాలమ్మ జాతర

గొల్లప్రోలు, జూన్ 23: గొల్లప్రోలు గ్రామదేవతగా విరాజిల్లుతున్న పాదాలమ్మ తల్లి జాతర మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయం వద్ద తీర్థం జరిగింది. పాదాలమ్మతల్లిని భక్తులు దర్శించుకుని పూజలు చేసి మొక్కులు సమర్పించారు. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

పిఠాపురం, జూన్ 23: బంగారు వస్తువులు పోగొట్టుకున్న మహిళకు వాటిని పోలీసులు అప్పగించారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలోని ఎఫ్‌సీఐ గోడౌన్స్ వెనుక పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే రేవాడ అప్పారావు నివాసం ఉంటారు. జూన్ 9న అప్పారావు తన భార్య దేవితో కలిసి రాజుపాలెంలో జరిగిన ఫంక్షన్‌కు బంగారు ముత్యాలహారం, 3 కాసుల బంగారు నక్లెస్ ధరించి వెళ్లారు. ఇంటికి వచ్చి చూసుకునే సరికి మెడలో వస్తువులు కనిపించలేదు. దీంతో దేవి పిఠాపురం సీఐ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి నగలు పోయిన విషయంపై ప్రచారం చేయించారు. ఆదివారం ఈ వస్తువులు గుర్తుతెలియని వ్యక్తులకు దొరకగా వారు వచ్చి సీఐ ద్వారా దేవికి అప్పగించారు.

'సీపోర్టు లిమిటెడ్ అందిస్తున్న సహకారం అభినందనీయం'



వృద్ధాశ్రమంలో లిఫ్ట్ ప్రారంభిస్తున్న మురళీధరన్

సర్పవరం జంక్షన్, జూన్ 23: రాయుడుపాలెంలో చంద్ర సుబ్బయమ్మ రోటరీ ఆశ్రయ వృద్ధాశ్రమం అభివృద్ధికి కాకినాడ సీపోర్టు లిమిటెడ్ అందిస్తున్న సహకారం అభినందనీయమని సంస్థ చైర్మన్ టీవీఎస్ఎన్ ప్రసాద్ అన్నారు. ఆదివారం రాయుడుపాలెంలో రోటరీ ఆశ్రయ వృద్ధాశ్రమంలో రూ.20 లక్షలతో కాకినాడ సీపోర్టు లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన లిఫ్ట్, యోగా హాల్, కిచెన్ హాలును సీపోర్టు సీఈవో మురళీధరన్ ప్రారంభించారు. ఆశ్రమం అభివృద్ధికి అన్ని విధాలా సీపోర్టు సంస్థ సహకారం ఉంటుందన్నారు. అన్నపూర్ణ పథకం కింద రూ.30వేలు అందించిన దాతలను సత్కరించారు. ప్రసాద్ ఆధ్వర్యంలో మురళీధరన్‌ని రోటరీ క్లబ్ సభ్యులు సత్కరించారు. సంస్థ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, పాస్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ టీవీ బాలకృష్ణ, ఉషారాణి, పద్మజావాణి, సత్యపాల్, నేతి నాగేశ్వరరావు, వీవీవీ వర్మ, లంక సాయిబాబా, డాక్టర్ కామరాజు, విజయలక్ష్మి బాయిల్‌రా రైస్‌మిల్లు అధినేత గోలుగూరి హరనాథరెడ్డి ఉన్నారు.

అనధికారిక కబేళాల తనిఖీ

పిఠాపురం, జూన్ 23: పట్టణంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న అనధికారిక కబేళాలపై ఆదివారం అధికారులు దాడులు నిర్వహించారు. భజరంగదళ్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరుల ఫిర్యాదు మేరకు పిఠాపురం సీఐ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనరు కనకారావు పలు ప్రాంతాల్లోని అనధికారిక కబేళాలను తనిఖీ చేశారు. పలు చోట్ల పశువులు ఉన్నట్టు గుర్తించారు. అనుమతులు లేకుండా కబేళాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు. పట్టణంలో తాము ఎటువంటి కబేళాలకు అనుమతులు ఇవ్వలేదని కమిషనరు చెప్పారు.

పిఠాపురంలో మెగా జాబ్‌మేళా

పిఠాపురం, జూన్ 23: పట్టణంలోని పాతబస్టాండు వద్దగల మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం మెగా జాబ్‌మేళాను జనసేన నాయకుడు మురాలశెట్టి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఎస్ఎన్ ఇంటర్నేషనల్ ఫార్మా కంపెనీలో ఉద్యోగాలు కోసం హాజరైన వారికి పరీక్షలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. వారికి జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్ నియామక ఉత్తర్వులు అందజేశారు. మురాలశెట్టి సునీల్‌కుమార్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, కంపెనీ ప్రతినిధులు తదితరులున్నారు.

డయేరియా వ్యాప్తిచెందకుండా చర్యలు



అన్నవరంలో కుళాయినీటిని పరీక్షలకు సేకరిస్తున్న అధికారులు

అన్నవరం, జూన్ 23: జిల్లాల్లో కొమ్మనాపల్లి, బెండపూడి తదితర గ్రామాల్లో డయేరియా వ్యాప్తిచెందిన నేపథ్యంలో అన్నవరంలో అధికారులు ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఎంపీడీవో విజయకుమార్ పర్యవేక్షణలో నీటి నమూనాలు తీసుకుని ల్యాబ్‌కు పంపించారు. గ్రామంలో ఉన్న 3 వాటర్‌ట్యాంక్‌లు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అనే ది పరిశీలించారు. నీటి నమూనా పరీక్షల్లో ఏ లోటుపాట్లు లేవని గుర్తించారు. అయినా నిర్లక్ష్యం చూపకుండా ఎప్పటికప్పుడు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచి నీరు నిల్వలేకుండా చూడాలని పంచాయితీ కార్యదర్శి శ్రీరామచంద్రమూర్తికి సూచించారు.

తాళ్లరేవు: గ్రామీణ ప్రాంతాల్లో శివారు గ్రామాలకు ప్రభుత్వం అందిస్తున్న తాగునీరు నాణ్యతను ఎంపీడీవో ప్రభాకరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం తనిఖీ చేసింది. గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ మారుతీరావు మాట్లాడుతూ రక్షిత మంచినీరు సరఫరా దూరం అయ్యేకొద్ది తాగునీరు నాణ్యత తగ్గవచ్చని, దీనికి తీసుకోవాల్సిన చర్యలకు తాగునీరు నాణ్యతను పరిశీలిస్తున్నట్టు తెలిపారు. మండలంలోని 17గ్రామపంచాయతీలో ఉన్న తాగునీరు నాణ్యతను పరిశీలించనున్నట్టు చెప్పారు. ఈవోపీఆర్డీ ఎమ్.భైరవమూర్తి, సర్పంచ్ శాకా శంఖరుడు, గ్రామ సెక్రటరీ వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

గొల్లప్రోలు రూరల్: ప్రజలకు సురక్షితమయిన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని గొల్లప్రోలు ఎంపీడీవో జయప్రకాశరావు తెలిపారు. గొల్లప్రోలు మండలం ఏకే, ఏపీ మల్లవరం గ్రామాల్లో సిబ్బంది సేకరించిన తాగునీటి శాంపిల్స్‌ను పరిశీలించారు. క్లోరినేషన్ సక్రమంగా జరిగిందా లేదా అని తనిఖీ చేశారు.

పలుచోట్ల భారీ వర్షం



ప్రత్తిపాడులో కురుస్తున్న వర్షం



పిఠాపురంలో రోడ్డుపై కూలిన చెట్టు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 23: పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో వర్షం కురవడంతో పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పిఠాపురం తహశీల్దారు కార్యాలయం వద్ద ఉన్న చెట్టు కూలి ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వర్షంతో డ్రెయిన్లు పొంగిపొర్లి రోడ్లపైకి నీరు చేరింది.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో గ్రామీణ రహదారులు చిత్తడిచిత్తడిగా మారాయి. 2 రోజుల నుంచి వర్షాలతో గ్రామాల్లో మురుగునీరు, వర్షపునీరు కలిసిపోయి అపారిశుధ్య వాతావరణం నెలకొంది. దీంతో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సామర్లకోట: సామర్లకోట పట్టణం, మండలంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకూ భారీ వర్షం కురిసింది. గత 4 రోజులుగా ఉక్కబోత వాతావరణంతో సతమతమవుతున్న ప్రజానీకం భారీ వర్షంతో ఉపశమనం పొందారు. సామర్లకోట పరిసరాల్లో రైతులు కాలువ కింద డెల్టా పొలాల్లోనే గాక మెట్ట ప్రాంతాల పొలాలను దుక్కిదున్నే సాగు పనులను చేపట్టారు. కరపెండలం దుంప నారుమడులకు వర్షంతో నీటి తడులు లభించినట్లైంది.

గొడుగులు, పుస్తకాల అందజేత

పిఠాపురం, జూన్ 23: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆదివారం నిర్వహించిన డాన్ టూ డెస్క్ కార్యక్రమంలో భాగంగా వీధివ్యాపారస్తులకు గొడుగులు, విద్యార్థులకు పుస్తకాలు, కాంపాస్ బాక్సులను వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు అందజేశారు. పాతబస్టాండు మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో జాతిపిత మహాత్మ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వాసవిక్లబ్ ఇంటర్నేషన్ వైస్ ప్రెసిడెంట్ నలూరి నూకరాజు, వెలగా వెంకట నగేష్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ నాగమళ్ల రాజారావు, క్లబ్ ప్రతినిధులు కంతేటి లక్ష్మీనారాయణ, కే.మూర్తి బి.ఉమామహేష్ ఉన్నారు.

'సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా'

పిఠాపురం, జూన్ 23: ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని ఒక పాఠశాలలో ఆదివారం జరిగిన ప్రైవేటు స్కూలు టీచర్స్ అసోసియేషన్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రైవేటు ఉపాధ్యాయుల డిమాండ్లను ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుంకర అనిల్‌చౌదరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్‌చౌదరి, అయ్యప్పస్వామి, ప్రవేటు స్కూల్స్ ప్రిన్సిపాల్స్ కట్టా నాగేశ్వరరావు, ఆనంద్, మాగాపు సూర్యమోహన్, శ్రీనివాస్, కిశోర్‌బాబు, రామదత్తు, సీహెచ్ నాగేశ్వరరావు, గంగబాబు, రాజబాబు, టీడీపీ నేతలు సకుమళ్ల గంగాధర్, కొరుప్రోలు శ్రీను, నల్లా శ్రీను, అల్లవరపు నగేష్, సూరవరపు సుబ్బారావు, రావుల రమేష్, మొల్లి నాగమరిడిరాజు తదితరులు ఉన్నారు.

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి

సర్పవరం జంక్షన్, జూన్ 23: కాకినాడ రూరల్ అసెంబ్లీ కన్వీనర్ లీలావతి ఆధ్వర్యంలో రమణయ్యపేట, 49వ డివిజన్ 117వ బూత్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కవికొండల భీమశేఖర్‌ల ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, సూర్యనారాయణరాజు, ముత్తా నవీన్‌కృష్ణలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఏ.వెంకటేష్, రెడ్డి రమేణేశ్వర్, పద్మ, బల్ల సుధాకర్, కాదా మూర్తి ఉన్నారు.

ఏలేశ్వరం: సిరిపురం, ఎర్రవరం గ్రామాల్లో బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, మండలాధ్యక్షుడు కూరాకుల రాజా, పట్టణంలో పైల సుబాష్ చంద్రబోష్ నేతృత్వంలో శ్యామ్‌ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిరిపురంలో కొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిల్లా కోపరేటివ్ సెల్ కన్వీనర్ వెలుగూరి హరేరామ, సాగి బంగార్రాజు, వజ్రంగి సల్మాన్‌రాజు, కొల్లా వీరమణికంఠ, మదినే తాతాజీ, లచ్చబాబు, నారాయణరావు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నేతలు

జగ్గంపేట, జూన్ 23: జగ్గంపేట ఎమ్మెల్యేగా జ్యోతుల నెహ్రూ విజయం సాధించడంతో కిర్లంపూడి సర్పంచ్, జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ ఎస్సీసెల్ అధ్యక్షుడు గుడాల శ్రీలత రాంబాబు ఆధ్వర్యంలో కిర్లంపూడి నుంచి ఎంపీటీసీలు సాదే కుమారి ఏసుబాబు, కుట్టు నారిబాబు, బంగార్రాజు ఆధ్వర్యంలో గౌరీపట్నం చేరుకుని మొక్కులు చెల్లించుకుని జగ్గంపేట వచ్చి ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ఏలేశ్వరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకులు 14వ వార్డులో కనకదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి 101 కొబ్బరికాయలు కొట్టి, చీర,పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు పెంద్ర శ్రీను, యండంగుండి నాగబాబు, రాయుడు చిన్న, కోనాల వెంకటరమణ, కార్యకర్తలు లలిత, రమేష్, బాబ్జి పాల్గొన్నారు.

సినీ సంగీత విభావరి



పోర్టుసిటీ(కాకినాడ), జూన్ 23: కోన విజయభాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. కాకినాడ సూర్యకళా మందిరంలో హాయి.. హాయి.. హాయి.. బాలు పాట వింటే హాయి.. పేరుతో బిరుదా కాశీకృష్ణ సాయినాథ్ బృందం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి విభావరి నిర్వహించారు. సంస్థ 9వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమం ప్రాంగణానికి దూలం సత్య అనంతలక్ష్మి పేరు పెట్టారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి, సంస్థ వ్యవస్థాపకులు బీవీఎస్ ప్రభాకర్‌తోపాటు అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం సూర్యకుమారి దంపతులను ఘనంగా సత్కరించారు. గాన గంధర్వుడు ఎస్పీ బాలు సుబ్రహ్మణ్యం గానం చేసిన గీతాలను గాయకులు ఆలపించారు. డాక్టర్ కృష్ణప్రసాద్, నర్సరాజా, దూలం శ్రీనివాసరావు, మార్ని జానకిరామ్ చౌదరి పాల్గొన్నారు. కళాకారులు ప్రభాకర్, బాబి, రామకృష్ణ, వాణి, సవిత, లలిత విభావరిలో కాశీకృష్ణ సాయినాథ్ నేతృత్వంలో గీతాలను ఆలపించారు.

ఫొటో స్టూడియోలో చోరీ

పెద్దాపురం, జూన్ 23: స్థానిక తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఉన్న బాలాజీ ఫొటో స్టూడియోలో ఆదివారం చోరీ జరిగింది. పోలీసులు వివరాల ప్రకారం.. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు స్టూడియో తలుపులు బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించి 2 కెమెరాలు, రూ.10 నగదును చోరీచేశారు. స్టూడియో యజమాని దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్ఐ వెలుగుల సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.